క్లుప్తంగా

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలి



మాట్లాడుతున్న కడప ఎంఈఓ నారాయణ

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉంటూ అభ్యసన ప్రక్రియలో నూతన పద్ధతులను నేర్చుకుంటూ విద్యార్థులకు బోధించాలని కడప మండల (అడ్మినిస్ట్రేటివ్) విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ సూచించారు. బుధవారం కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు డిజిటల్ విద్యా విధానం వైపు విద్యార్థులను మళ్లించాలన్నారు. కార్యక్రమంలో మెయిన్ స్కూల్ హెచ్‌ఎం నాగమణి, ఆలంఖాన్‌పల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మునిరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ సమస్యలపై ఆగస్టు 1న అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ముట్టడి, 7న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, 17న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు గోపి, ఆనందరావు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షా కేంద్రాల తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ పరీక్షా కేంద్రాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడప నగరంలోని నిర్మల బీఈడీ కళాశాల, భారత్ బీఈడీ కళాశాలలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాల్ టికెట్‌లను, కళాశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచించారు.

చంద్రబాబు రైతులకు చేసిన మేలు ఒక్కటీ లేదు



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: ప్రతిపక్షనేత చంద్రబాబు రైతులకు చేసిన మేలు ఒక్కటి కూడా లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో రైతులకు ప్రయోజనం కలిగించేలా ఒక్క నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడే సరికి ఆయనకు రైతులపైనేగాక అన్ని వర్గాలపై ప్రేమ పుట్టుకొస్తోందన్నారు. అసలు రైతుల గూర్చి మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదన్నారు. వైఎస్‌ఆర్ రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానని ప్రకటిస్తే, అలా చేస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలని చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. 2014లో రైతులకు రుణ మాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తర్వాత మాట మార్చారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడంలోగానీ, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలోగానీ ఆయన శ్రద్ధ వహించలేదన్నారు. వ్యవసాయం దండగ అన్న పెద్ద మనిషి మళ్లీ ఎన్నికలొస్తున్నాయని, రైతుల జపం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గౌస్, నాసిర్ పాల్గొన్నారు.

డీఈఓ అవినీతిపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డిపై విచారణ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని బుధవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. విద్యార్థులు తమ సమస్యలపై ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఈఓ ఉత్తర్వులు జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. విద్యార్థులు పోరాటాలు చేసేందుకు వీలు లేదని డీఈఓ ఆదేశించడం విడ్డూరంగా ఉందన్నారు. బాధ్యతాయుత ఉద్యోగంలో ఉంటూ ఉపాధ్యాయుల పట్ల అసభ్య పదజాలంతో దూషించడం దారుణమన్నారు. డీఈఓ అవినీతిపై పత్రికల్లో వస్తున్న ఆరోపణలపై విచారించాలని, లేనిపక్షంలో ఈనెల 31న డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



వైవీయూ: ఆర్ట్స్ కళాశాలలో ఆర్మీ సిబ్బందిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ / కడప సిటీ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఆక్రమించిన ప్రాంతాన్ని భారతదేశం తిరిగి కైవసం చేసుకుని ప్రపంచానికి భారత సత్తాను చాటిచెప్పిందన్నారు. ఎముకలు కొరికే చలిలో భారతసైనికులు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో ఉన్నారంటే దేశసరిహద్దుల్లో సైనికులు ఉన్నారన్న నమ్మకంతోనేనన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. సావిత్రి మాట్లాడారు. అనంతరం ఆర్మీ సిబ్బంది సుబేదార్ అశోక్‌కుమార్, బిష్ణోయ్‌లను అధ్యాపకులు సన్మానించారు. కార్య క్రమంలో అధికారులు డా. మహేష డా. విజయ్‌కుమార్, డా. రవిశేఖర్, డా. నరసింహారావు, డా. నాగేంద్ర, డా. శ్రీనీత, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రితోపాటు స్వీట్లను పంపిణీ చేశారు. కడప నగరంలోని శాంతినగర్ యూపీ స్కూలులో 350 మంది విద్యార్థులకు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో లాంగ్ నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్లేట్ పెన్సిళ్ల తదితర విద్యా సామాగ్రితోపాటు స్వీట్లను పంపిణీ చేశారు. అలాగే కార్గిల్ విజయ్ దివస్ ఆపరేషన్ విజయ్ ప్రాముఖ్యత, భారతదేశ గెలుపు, పాక్ ఆక్రమిత ప్రాంతాన్ని తిరిగి కైవసం చేసుకోవడం వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మాజీ సైనిక సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, అడ్వయిజరీ బోర్డు మెంబర్ బీవీ గోపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, హెచ్‌ఎం అబ్బిరెడ్డి పాల్గొన్నారు.

కేఓఆర్‌ఎంలో ..

కడప ఎడ్యుకేషన్: కేఓఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన వీరజవాన్‌లకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ విక్రమ్ బాత్ర, యోగేంద్ర సింగ్ యాదవ్, పాండే బల్వాన్ సింఘ్, సంజయ్‌కుమార్, వివేక్ గుప్త లాంటి 527 మంది మన జవాన్‌లు ఈ యుద్ధంలో వీర మరణం పొందారన్నారు. చివరగా పాకిస్తాన్ సైన్యాన్ని తరిమి వేసి భారత్ విజయం పొందిందన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ తులసికృష్ణ పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగం చిరస్మరణీయం

కడప కల్చరల్ : కార్గిల్ యుద్ధంలో మన దేశ రక్షణ కోసం ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన కార్గిల్ అమర వీరుల త్యాగం చిరస్మరణీయమైనదని ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్యతో కలిసి బుధవారం స్థానిక ఇంటాక్ కార్యాలయంలో కార్గిల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ దేశ పౌరులుగా వారి త్యాగాలను గుర్తు చేసుకుందామన్నారు. అనంతరం క్యాండిల్స్ వెలిగించి సైనిక వీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్లు బోగాల కొండారెడ్డి, వై.జోజిరెడ్డి, ఇంటాక్ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ కార్గిల్ వీరుల త్యాగ ఫలం మనమందరం గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం ఆర్మీ సిబ్బంది సుబేదార్ అశోక్‌కుమార్, బిష్ణోయ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మి, డా. పి. శచీదేవి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ విన్నీతేజ, అధ్యాపకులు రవిశంకర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.



కడప సిటీ: శాంతినగర్ యూపీ స్కూల్‌లో విద్యా సామగ్రి పంపిణీలో పాల్గొన్న మాజీ సైనికులు



కడప కల్చరల్ : అమర వీరులకు నివాళులర్పిస్తున్న ఇంటాక్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు



కడప ఎడ్యుకేషన్: వీర జవాన్‌ల మృతికి సంతాపం తెలుపుతున్న కేఓఆర్‌ఎం ప్రిన్సిపాల్, విద్యార్థులు

28న జూనియర్ కళాశాలల బంద్ జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఇంటర్ విద్యలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని ఈనెల 28వ తేదీన నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ కడప విభాగ కన్వీనర్ మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని శ్రీ హరి జూనియర్ కళాశాలలో బంద్‌కు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. శ్రీచైతన్య, నారాయణ కార్పోరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకుని ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

30న కార్మిక సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలో ప్రధాన మంత్రి మోదీ కార్మిక వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న కార్మిక కర్షక రాష్ట్ర సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఇందుకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పంటలకు మద్దతు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్నదాతల సంక్షేమాన్ని విస్మరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బీ.దస్తగిరి రెడ్డి , ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం వి సుబ్బారెడ్డి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి మనోహర్, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల సాధనకు కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా తప్పని సరి అని, ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు రాజీనామా చేయాలని ప్రొఫెషనల్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు.

కడపలోని వారి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం పార్లమెంట్ సమావేశంలో బీజేపీ ప్రభుత్వం కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని తెలపడం వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వైఫల్యం అన్నారు. ఉక్కు పరిశ్రమ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపీ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన

కడప కార్పొరేషన్: పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కడప నగరంలో రెండోరోజు కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. జల్లులతో కూడిన వాన నిర్విరామంగా కురుస్తూనే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వారిని తీసుకెళ్లే తల్లిదండ్రులు, ఉద్యోగులు వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలబడి తోపుడుబండ్ల వ్యాపారులు, పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. వాన వల్ల నగర నడిబొడ్డులోని ఆర్టీసీ బస్టాండు , ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయం, కోటిరెడ్డి కూడలి, గురుకుల్ విద్యాపీఠ్, అప్సర కూడలి ప్రాంతాల్లోని రహదారులపై వర్షపునీరు నిలిచింది. అలాగే లోతట్టు ప్రాంతాలైన ఎస్‌బీఐ కాలనీ, రామరాజుపల్లె, మృత్యుంజయకుంట, ఫక్కీరుపల్లి, ప్రకాష్‌నగర్, నంద్యాల నాగిరెడ్డి కాలనీ, ఖలీల్‌నగర్, చిన్నచౌకు, గౌస్‌నగర్, గంజికుంట కాలనీ, రామాంజనేయపురం, సాగర్ కాలనీ, తిలక్‌నగర్, ఆర్‌కే నగర్, బీడీ కాలనీ, తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. శివారు ప్రాంతాల్లోని మట్టిరోడ్లు బురదమయం అయ్యాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



కడప నగరంలో కోర్టు వద్ద..



కడప ఆర్టీసీ బస్టాండ్‌లో...

ఆంగ్లభాషకు ప్రాధాన్యత ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మాతృభాషతోపాటు ఆంగ్లభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఈఓ -2 ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. కడప నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల సముదాయ పరిధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సముదాయ సమావేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బోధన ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, విలువలు పెంపొందించే దిశగా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పలత, సముదాయ ఆర్పీలు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

పులివెందుల రూరల్ : మట్టి నమూనా పరీక్షలకు అనుగుణంగా అరటి పంటను సాగుచేయాలని జాతీయ అరటి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త జయభాస్కరన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో పులివెందుల, వేంపల్లె హెచ్ఓలు రాఘవేంద్రారెడ్డి, రెడ్డయ్యల ఆధ్వర్యంలో అరటి సాగుచేయు విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జాతీయ అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జయభాస్కరన్, ఉద్యాన శాఖ ఏడీ సుభాషిణిలు హాజరై మాట్లాడారు. అరటిలో ఎరువులు, సూక్ష్మ పోషకాలను వాడుకోవాలని, భూమిలో ఉండే పోషకాల ఆధారంగా చేసుకుని ఎరువులు వేసుకుంటూ ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా అరటి పంటను ఎగుమతి చేసి అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చునన్నారు. గ్యాప్ సర్టిఫికేషన్ కొరకు పాటించాల్సిన నియమ నిబంధనలను తెలియజేశారు. అరటిలో సిగటోకా, ఆకుమచ్చ తెగులు నివారణా చర్యలను క్లుప్తంగా వివరించారు. అరటిలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో అరటి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుశీల, వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 20 కుటుంబాలు చేరిక

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పోతు సాంబశివారెడ్డి, పోతు శ్రీనువాసులురెడ్డి మరో ఇరవై కుటుంబాలు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సాంబశివారెడ్డి, శ్రీనువాసులురెడ్డి, నితేష్ రెడ్డి, దినేష్‌రెడ్డి, చెంద్రాయుడు, చంటి రాజు, మల్లయ్య మరి కొందరు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, గురివిరెడ్డి, నాగార్జునరెడ్డి, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.



వెల్లటూరులో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



నిజాయితీగా సేవలు



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నవీన

కడప నగరం 45 వ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ సచివాలయంలో ఊటుకూరు గ్రామానికి చెందిన నవీనా వలంటీర్‌గా నిజాయితీగా సేవలను అందిస్తోంది. ఈమెకు కేటాయించిన 50 ఇండ్లలోని ప్రజలతో ఆప్యాయంగా ఉంటూ వారి కష్టాలను తెలుసుకొని సేవలను అందిస్తోంది. కోవిడ్ సమయంలో ధైర్యంగా బయటకు వచ్చి లబ్ధిదారులకు పెన్షన్లను అందించి వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకుంది. వారికి ఏ సమస్య వచ్చినా కుటుంబ సభ్యురాలిగా సేవలను అందించింది. వలంటీర్ సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. – కడప వైఎస్‌ఆర్ సర్కిల్

మనవరాలిగా సేవలను అందించింది



నాకు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా వస్తున్న వితంతు పింఛన్‌ను వలంటీర్ నవీన ఇంటి వద్దకు వచ్చి మా ఇంట్లో మనవరాలిగా పిలిచి రూ. 2750 నగదును అందించింది. చదువు రాని మేము గతంలో పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడేవాళ్లం. అలాంటిది మా ఇంటి వద్దకు వచ్చి మాకు కావాల్సిన ధృవ పత్రాలను అందించింది.

– పి. చిన్నక్క, ఊటుకూరు, 45వ డివిజన్

కేంద్రం అహంకార వైఖరి వీడాలి



విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై మోడీ ప్రభుత్వం అహంకార వైఖరిని వీడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఆర్థికంగాను, సాంకేతికపరంగా సాధ్యం కాదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభలో ప్రకటించడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి పరాకాష్ట అన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవసరమైన మౌళిక సదుపాయాలు అయిన రోడ్డు, రైల్వే, విమాన సౌకర్యంతో పాటు నీళ్ళు, విద్యుత్, 27 వేల ఎకరాల భూములు ఉన్నా.. ఇవేమీ కేంద్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆంజనేయులు, వెంకటశివ, వలరాజు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఎలా సాధ్యం కాదో తెలపాలి

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఎలా సాధ్యం కాదో తెలపాలని బుధవారం ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బి.నారాయణ, ప్రధాన కార్యదర్శి సిఆర్‌వి ప్రసాదరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన చట్టంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ఎందుకు ప్యాకేజీ ఇవ్వడం లేదన్నారు.

డీవైఎఫ్ఐ కార్యాలయంలో..

కడప ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రం మోసకారి తనం బట్టబయలు అయిందని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో జిల్లా ఒకటన్నారు. పార్లమెంట్‌లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం సాధ్యం కాదని చెప్పడం చూస్తే నయవంచనకు గురి చేయడమేనన్నారు.

నేడు దైవజనుల సదస్సు

– పోస్టర్లను ఆవిష్కరించిన ఏపీ ఫాస్టర్స్ ఫెడరేషన్ నాయకులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ సభ్యులు

కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ ఫాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని రహమతీయ ఫంక్షన్ హాలులో క్రైస్తవ ప్రతినిధులు, దైవ సేవకుల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ తెలిపారు. ఆ మేరకు బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైవ సేవకుల ఐక్యత, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ఫాస్టర్స్ ఉండగా, అందులో 300 మందికి పైగా సదస్సుకు హాజరవుతారన్నారు. ఈ సదస్సు ఉదయం 9.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు జరుగుతుందన్నారు. అనంతరం మణిపూర్‌లో జరిగిన సంఘటనలకు నిరసనగా రహమతీయ ఫంక్షన్ హాలు నుంచి మాచుపల్లె బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజద్‌బాష, జూపూడి ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి క్రైస్తవ నాయకులు హాజరవుతారన్నారు. బిషప్ కె.శ్యామూల్ బాబు మాట్లాడుతూ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఏపీ ఫాస్టర్స్ ఫెడరేషన్ సదస్సును జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయశేఖర్, డేవిడ్‌రాజు, జోసఫ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.